బస్ షెల్టర్ నిర్మించండి

- దశాబ్ద కాలంగా ఎదురుచూపులు
- ఎండా, వానలో ప్రయాణికుల ఇక్కట్లు
- ఏనుగుల గడ్డ జంక్షన్‌లో దుస్థితి




హనుమకొండలోని ఏనుగుల గడ్డలో రోడ్డుపై నిలబడి బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

హన్మకొండ చౌరస్తా: పండుగలు, ప్రత్యేక రోజుల్లో సరిపడా బస్సులు లేక ప్రయాణికులు స్వల్పకాలంగా ఇబ్బంది పడడం పరిపాటే. అలాంటి ఇబ్బందులు సంవత్సరంలో ఒకటి, రెండు రోజులు మాత్రమే. ఈక్రమంలో నిలబడేందుకు స్థలం లేక పోయినా ఏదోఒకలా గమ్యస్థానం చేరేందుకు ఆర్టీసీ బస్సుల కోసం ఎదురు చూస్తుంటారు. అలాగే రోజూ బస్సుల కోసం ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ ఎదురుచూడడం ఎంత కష్టమో మాటల్లో చెప్పలేనిది. సుమారు దశాబ్దకాలానికిపైగా ప్రయాణికులు రోడ్డుపైనే నిలబడి బస్సుల కోసం ఎదురు చూస్తూ విసిగివేశారుతున్నారు.

సౌకర్యాలు కరువు

హైదరాబాద్ తర్వాత వరంగల్‌ను రాష్ట్ర రెండో రాజధానిగా చెబుతున్న పాలకులు ఆ స్థాయిలో మాత్రం ప్రజలకు వసతులు కల్పించడంలో శ్రద్ధ కనబర్చడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. హనుమకొండ చౌరస్తా నుంచి వరంగల్‌కు వెళ్లే ప్రధాన దారిలో ఏనుగుల గడ్డ వద్ద సుమారు 15 ఏళ్ల క్రితం వరకు బస్‌షెల్టర్ ఉండేది. రోడ్డు అభివృద్ధిలో భాగంగా షెల్టర్‌ను తొలగించిన మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు.. తిరిగి నిర్మించకుండా వదిలేశారు. ప్రజల నుంచి టికెట్ల రూపంలో డబ్బులు వసూలు చేస్తున్న ఆర్టీసీ యాజమాన్యం సైతం ఆ దిశగా కనీస ప్రయత్నాలు చేసిన దాఖలాలు లేవు.

దుర్వాసనతో ఇక్కట్లు

కాజీపేట నుంచి వరంగల్ వైపునకు వెళ్లే నగర ప్రజలే కాకుండా, హనుమకొండ నుంచి నర్సంపేట, ములుగు, ఏటూరునాగారం, భూపాలపల్లి ప్రాంతాలకు వెళ్లే ఉద్యోగులు ఏనుగుల గడ్డ వద్ద బస్సు కోసం ఎదురు చూస్తుంటారు. బస్సును నిలిపేందుకు బస్ బేను ఏర్పాటు చేసి ప్రయాణికుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఆర్టీసీ యాజమాన్యం.. పన్నుల రూపంలో ప్రజల నుంచి ముక్కు పిండి వసూళ్లకు పాల్పడుతున్న అధికారులు బస్ షెల్టర్ నిర్మించాలన్న కనీస చర్యలు చేపట్టకపోవడం బాధాకరమని ప్రయాణికులు వాపోతున్నారు. ఏనుగుల గడ్డలో బస్ బే పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో కొంతమంది ఒకటి, రెండు బహిరంగంగానే కానిస్తుంటారు. దీంతో ఆ పరిసర ప్రాంతాలు దుర్గంధ భరితంగా కంపు కొడుతుంటాయి. దుర్వాసనలోనే ప్రయాణికులు బస్సుల కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పిల్లలు, వృద్ధులకు ఇబ్బందులు



కుటుంబంతో కలిసి ఊరికి వెళ్లేందుకు వస్తే బస్ పాయింట్ వద్ద పిల్లలు, వృద్ధులు కనీసం కూర్చో లేని పరిస్థితి. బస్సు చార్జీలు, ఇంటిపన్ను, నల్లా పన్ను అంటూ వసూలు చేసే అధికారులు ప్రయాణికులకు కనీస వసతులు కల్పించడంపై శ్రద్ధ కనబర్చకపోవడం బాధాకరం. ఇప్పటికైనా మేల్కొని మెట్రో నగరాల్లో మాదిరిగా నగర వ్యాప్తంగా బస్‌షెల్టర్లు నిర్మించాలి.

- గట్ల రమేశ్, గుడిబండల్

దుర్వాసన వస్తోంది



గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్‌లో లక్షల రూపాయల పన్నులు వసూలు చేస్తున్న అధికారులు.. హనుమకొండ, కాజీపేట ప్రధాన దారి వెంట బహిరంగంగా మల, మూత్ర విసర్జన చేస్తుంటే కనీస చర్యలు చేపట్టకపోవడం శోచనీయం. బస్ పాయింట్ వద్ద దుర్వాసనను భరిస్తూ బస్సు కోసం పావు గంటకు పైగా నిలబడి ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది.

- కక్కెర్ల శ్రీనివాస్, వెంకటాపురం

మహా ప్రదర్శనను జయప్రదం చేయాలి



మడికొండలో ర్యాలీలో పాల్గొన్న నాయకులు

మడికొండ: ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా జాంబవ సంఘం ఆధ్వర్యంలో మడికొండలో ఆదివారం డప్పు ర్యాలీ నిర్వహించినట్లు అధ్యక్షుడు అరూరి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా మిట్టపల్లి సురేందర్ హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు.. వేల గొంతులు మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మంద కుమార్‌మాదిగ, బండారి సురేందర్ మాదిగ, పుల్ల శ్రీనివాస్, స్వేరోస్ నాయకుడు పుల్ల కిషన్, స్థానిక జాంబవ సంఘం నాయకులు వస్కుల దేవేందర్, రాసమల్ల వెంకటస్వామి, పెద్దరాజు, గడ్డం శ్రీనివాస్, నాగరాజు, మోహన్‌రావు, కుమారస్వామి, మల్లికార్జున్, రాజు, రమేష్, బ్రదర్ అనిల్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నయీంనగర్: ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్షల డప్పులు.. వేల గొంతుల మహా ప్రదర్శన వాల్‌పోస్టర్లను నయీంనగర్ లష్కర్ సింగారంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు బొక్క రాజేష్ మాదిగ, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సుకుమార్ మాదిగ మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ నాయకత్వంలో నిర్వహించనున్న మహా ప్రదర్శనతో ఎస్సీ వర్గీకరణ చేయకుండా మాదిగలకు అన్యాయం చేస్తున్న తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి, ప్రపంచానికి మాదిగల ఆవేదన తెలిసేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చాగంటి ప్రకాష్ మాదిగ, ఎర్ర రాము, అరుణ్ మాదిగ, శ్రీనివాస్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

నాపై అసత్య ప్రచారాలు సరికాదు

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హన్మకొండ చౌరస్తా: ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి ఇంట్లో జరిగిన సమావేశానికి తాను వెళ్లినట్లు కొందరు పనిగట్టుకుని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఓ ప్రకటనలో ఖండించారు. ముఖ్యమంత్రి, మంత్రులపై అసమ్మతిగా ఉన్నట్లు తన ప్రమేయం లేకుండా యూట్యూబ్, పలు పత్రికల్లో ఫొటోలతో కథనాలు ప్రచురించడం సరైంది కాదని పేర్కొన్నారు. సహచర ఎమ్మెల్యేలను కలవడంలో తప్పేముందని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేల ఇళ్ల వద్దకు తాను వెళ్లలేదు కదా అని పేర్కొన్నారు. ఇప్పటికైనా కోడిగుడ్డుపై ఈకలు పీకే చర్యలు మానుకోవాలని హితవు పలికారు.

ఉద్యోగులకు మినహాయింపుపై హర్షం

హన్మకొండ చౌరస్తా: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉద్యోగులకు రూ.12 లక్షల వరకు ఐటీ మినహాయింపు మంచి పరిణామమని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి అన్నారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పుడున్న పరిస్థితుల్లో గ్రామాల్లో సిబ్బంది లేక సతమతం అవుతుంటే, అక్రమంగా మట్టి, ఇసుక రవాణాను అడ్డుకునేందుకు సెలవు దినాల్లో సైతం గిర్దావర్లు విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. ఉద్యోగులకు నగదు రహిత వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ బాధ్యులు నరసింహనాయక్, మహ్మద్ సలీంపాషా, మారుపట్ల మల్లయ్య, గొట్టిముక్కుల సాంబరాజు, ఐలయ్య, భూక్యా కన్న నాయక్, సాంబయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలి




ఉపాధ్యాయులతో ప్రిన్సిపాల్ బ్రదర్ ఆంటోని

కాజీపేట రూరల్: తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యతోపాటు వారికి నచ్చిన రంగాల్లో రాణించేందుకు ప్రోత్సహించాలని గాబ్రియల్స్ స్కూల్ పూర్వ విద్యార్థి మంచిర్యాల డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ అధికారి శివ్ ఆశిష్ సింగ్ సూచించారు. కాజీపేట సెయింట్ గాబ్రియల్స్ హైస్కూల్ మైదానంలో శనివారం రాత్రి వరకు జరిగిన ప్లాటినం జూబ్లీ (70వ వార్షికోత్సవం) వేడుకలకు స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ ఆంటోని పొలిశెట్టి అధ్యక్షతన వహించగా, ముఖ్యఅతిథి శివ్ ఆశిష్ సింగ్ మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నతస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. వేడుకల్లో రోమ్ ఫార్మర్ సుపీరియర్ జనరల్ మాంట్‌ఫోర్టు బ్రదర్స్ ఆఫ్ సెయింట్ గ్యాబ్రియల్ రెవ.బ్రదర్ జాన్ కల్లారకల్, పూర్వ విద్యార్థులు డాక్టర్ రమ్య మాదిరెడ్డి, తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ నేహ అగర్వాల్, సులక్ష్య సేవా సమితి ఫౌండర్ సంతోష్ మండువ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పట్టాల సాధనకు చలో కలెక్టరేట్

కాజీపేట అర్బన్: కాజీపేట మండలంలోని అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని, డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకుడు ఎం.చుక్కయ్య డిమాండ్ చేశారు. అందుకు భూపోరాటానికి సీపీఎం సిద్ధంగా ఉందని అన్నారు. న్యూశాయంపేటలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇళ్ల స్థలాల పట్టాల సాధనకు ఈనెల 4న చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడిలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఓరుగంటి సాంబయ్య, మదన్‌చారి, దార్న ప్రభాకర్, మొగిళి, మురళి, లక్ష్మి, రజిత, భవాని, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చుక్కయ్య

సంఘం సభ్యుల అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాం రాజేశ్

ఖిలా వరంగల్: సంఘ సభ్యుల సంక్షేమాభివృద్ధికి మరింతగా కృషి చేస్తానని శ్రీసాయి పరపతి సంఘం అధ్యక్షుడు శ్రీరాం రాజేశ్ అన్నారు. వరంగల్ శివనగర్‌లో ప్రధాన కార్యదర్శి బత్తుల నవీన్ కుమార్, బుదారపు భాస్కర్ అధ్యక్షతన సంఘం 14 వార్షికోత్సవ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీరాం రాజేష్ మాట్లాడుతూ 114 మంది సభ్యుల సంక్షేమంతోపాటు ఆహ్లాదం కోసం కుటుంబ సమేతంగా విహార యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. అందరి ఆమోదంతో అండమాన్ నికోబార్ విహారయాత్రకు నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. అనంతరం బత్తుల నవీన్‌కుమార్.. రెండేళ్ల ఆదాయ - వ్యయాలను సభ్యుల ఎదుట ప్రవేశ పెట్టగా సభ్యులందరు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో గోపాల విజయ్‌కుమార్, కోశాధికారి వడ్డె పల్లి రఘునాథ్, ఆడెపు సాంబమూర్తి, కుడికాల సుధాకర్, సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ యుద్ధభేరికి ఎంబీసీ కులాలకు ఆహ్వానమేది?

కాజీపేట అర్బన్: ఆదివారం నిర్వహించిన బీసీ యుద్ధభేరి సభకు ఎంబీసీ 36 కులాలకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఎందుకు ఆహ్వానం పంపలేదని తెలంగాణ దాసరి సంఘం అధ్యక్షుడు కె.సంతోష్ ప్రశ్నించారు. బీసీ కులంలోని అన్ని కులాలను బీసీ రాజకీయ యుద్ధభేరికి రావాలని పిలుపునిచ్చిన మల్లన్నకు.. ఎంబీసీ కులాలపై అవగాహన లేదా అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవం

ఖిలా వరంగల్: వరంగల్ 42వ డివిజన్ రంగశాయిపేటలో నెహ్రూ విగ్రహం జంక్షన్ సీతారాముల దేవస్థానం వద్ద లక్ష్మి, భూలక్ష్మి బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. బొడ్రాయి ప్రతిష్ఠాపన కమిటీ కన్వీనర్లు కొల్లూరు యోగానంద్, గుండు పూర్ణచందర్ ఆధ్వర్యంలో వేద పండితుడు భాస్కర్‌చారి బృందం నేతృత్వంలో బొడ్రాయికి పూజలు చేశారు. పలుకాలనీల మహిళలు బోనంతో తరలివచ్చి గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం దూపకుంట గ్రామానికి చెందిన బైండ్ల కులస్తులు బొడ్రాయి ఎదుట బలిధారణ కోసం పట్నం వేసి పూజలు చేశారు. గౌడ కులస్తులు హాజరై ఉత్సవ కమిటీ సభ్యులకు కల్లు ఘటం అందజేశారు.



మొక్కులు చెల్లించుకున్న భక్తులు

కూలీ బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలి



మాట్లాడుతున్న రాజేందర్

హసన్‌పర్తి: ఉపాధి కూలీలకు కూలీ బీమా పథకాన్ని వర్తింపజేయాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. జాతీయ ఉపాధి హామీ కూలీల దినోత్సవాన్ని హసన్‌పర్తి మండలం సీతంపేటలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పనిదినాలను వంద రోజుల నుంచి రెండు వందల రోజులకు పెంచాలని సూచించారు. కూలీలకు పని ప్రదేశం వద్ద ప్రమాద బీమాను రూ.రెండు లక్షల నుంచి రూ.పది లక్షల వరకు పెంచాలని కోరారు. ఉపాధి హామీ జాబ్ కార్డుల కంటే పనికి వెళ్లే వారి సంఖ్య అధికంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకురాలు బొౌతు రాధ, భాగ్య, రమాదేవి, కూలీలు వసంత, లక్ష్మి, నిర్మల, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల 'గోల్డెన్ జూబ్లీ'

మడికొండ: పూర్వ విద్యార్థుల గోల్డెన్ జూబ్లీ వేడుకలను మడికొండలోని కరిష్మా గార్డెన్‌లో ఆదివారం నిర్వహించారు. వరంగల్‌లోని జేపీఎన్ రోడ్డు మహబూబియా హైస్కూల్ 1974 – 75వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మడికొండలోని కరిష్మా గార్డెన్‌లో కుటుంబ సమేతంగా కలుసుకొని సందడి చేశారు. ఈ సందర్భంగా నాటి గురువులను సన్మానించారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్‌రావు, పాషా, పూర్వ విద్యార్థులు డాక్టర్ చంద్రశేఖర్, ఆర్యా దేవేందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, నాగేంద్రబాబు, వెంకటస్వామి, భవాని శంకర్, వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం



ఎన్నికైన టీచర్స్ ఫోరం ప్రతినిధులు

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేటలో వరంగల్ బీసీ యునైటెడ్ ఇంటలెక్చువల్స్ ఫోరం ఆధ్వర్యంలో బీసీ టీచర్స్ సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర బీసీ ఇంటలెక్చువల్స్ ప్రతినిధి డాక్టర్ ఆవ్వారు వేణుకుమార్ హాజరై మాట్లాడారు. బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం వరంగల్ చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.వీరస్వామి మాట్లాడుతూ రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ టీచర్లు తమ ఓటు శక్తిని చాటుకోవాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ టీచర్లు కలిసి సమాజ ఐక్యతపై చైతన్యవంతం చేయాలని అభిప్రాయపడ్డారు. అంతకుముందు బీసీ టీచర్స్ ఫోరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం కోఆర్డినేటర్లు మండల పరశురాములు, ధర్మపురి రాజగోవిందు, బీసీ నేతలు తుమ్మ తిరుపతి, చిగిరి కుమారస్వామి, కృష్ణ, అంకం సతీష్, రమేష్‌బాబు, ఆరెల్లి శ్రీనివాస్, సురేష్, రమేష్, భాస్కర్, జ్ఞానేశ్వర్, నరసింహాచారి పాల్గొన్నారు.

ఖోఖో కోచ్‌కు సన్మానం

వరంగల్ స్పోర్ట్స్: ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన మొదటి ప్రపంచ ఖోఖో చాంపియన్‌షిప్‌నకు రెఫరీగా వ్యవహరించిన హనుమకొండ డీఎస్‌ఏ కోచ్ రమేశ్‌ను హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో ఆదివారం సన్మానించారు. ముఖ్యఅతిథిగా ఒలింపిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు అజీజ్‌ఖాన్ హాజరై మాట్లాడుతూ వరంగల్ నుంచి అంతర్జాతీయ వేదికపై రెఫరీగా వ్యవహరించడం గర్వించదగిన విషయమని అన్నారు. కార్యక్రమంలో వరంగల్ ఖోఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తోట శ్యామ్, హ్యాండ్‌బాల్, రెజ్లింగ్ సంఘాల రాష్ట్ర కార్యదర్శులు శ్యామల పవన్, మహ్మద్ కరీం, ఖోఖో సంఘం రెఫరీ బోర్డు చైర్మన్ సదానందం, బాధ్యులు రాంబాబు, స్వప్న, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.



రమేశ్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

అమలు కాని ఎన్నికల హామీలు



హనుమకొండ - కరీంనగర్ జాతీయ రహదారి



రాత్రివేళ ఢీకొన్న లారీలు (ఫైల్)

- ప్రమాదాలకు నిలయంగా జాతీయ రహదారి
- సెంట్రల్ లైటింగ్ కోసం ఎదురుచూపులు

హసన్‌పర్తి: హనుమకొండ - కరీంనగర్ ప్రధాన రహదారిలోని హసన్‌పర్తి మండల రెవెన్యూ కార్యాలయం నుంచి సీతంపేట క్రాస్ వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేస్తామని నాయకులు ఇస్తున్న హామీలు అమలుకావడం లేదు. కొన్నాళ్లుగా ఇక్కడ సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని స్థానికుల నుంచి డిమాండ్ వ్యక్తమవుతోంది. తాను గెలిచిన తర్వాత మొదట ప్రాధాన్యం సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడమేనని అభ్యర్థులు హామీలు ఇచ్చి ఓట్లు దండుకుంటున్నారు. గెలిచిన తర్వాత పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదాలు నిత్యకృత్యం

హసన్‌పర్తి నల్లగట్టు గుట్ట నుంచి సీతంపేట క్రాస్ వరకు నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మూగ జీవాలు సైతం ప్రాణాలు కోల్పోతున్నాయి. ప్రమాదాల నివారణకు తాత్కాలికంగా డివైడర్లు ఏర్పాటు చేసినప్పటికీ భారీ వాహనాలు ఢీకొనడంతో అవి దెబ్బతింటున్నాయి. తద్వారా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

పెద్ద చెరువు నుంచి సీతంపేట క్రాస్ వరకు అంధకారం

వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో పెద్ద చెరువు కట్ట నుంచి సీతంపేట క్రాస్ వరకు అంధకారం నెలకొంటోంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ విషయమై స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సెంట్రల్ లైటింగ్ అత్యవసరం



సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలి. వీధి దీపాలు లేకపోవడంతో రాత్రివేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.

- శీలం యాదగిరి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి

హామీలు నెరవేర్చాలి



ఎన్నికల హామీలను పాలకులు పట్టించుకోవడం లేదు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చు. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలి.

- విద్యాసాగర్, స్థానికుడు

బీసీ సీఎం అయ్యేంత వరకు ఉద్యమం



వరంగల్: తెలంగాణ రాష్ట్రానికి బీసీ వర్గాల వ్యక్తి నుంచి సీఎం పదవి చేపట్టేంత వరకూ ఉద్యమాలు చేస్తామని బీసీ మహిళా విభాగం నాయకురాలు చిమ్మని లత అన్నారు. బీసీ గర్జనకు ఆదివారం కాశిబుగ్గ నుంచి పెద్దసంఖ్యలో మహిళలను తీసుకుని ఆర్టీసీ బస్సులో సభకు బయలుదేరి వెళ్లారు.

క్లుప్తంగా

బేరుండా అమ్మవారిగా రాజరాజేశ్వరి



హన్మకొండ కల్చరల్: శిశిర నవరాత్రుల్లో భాగంగా వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి దేవాలయంలో అమ్మవారిని బేరుండా అమ్మవారిగా ఆదివారం అలంకరించి పూజలు చేశారు. ఆలయ అర్చకుడు యెల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని లలితా సహస్రనామ పారాయణం చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

వేంకటేశ్వరుడి ఊరేగింపు



వరంగల్ చౌరస్తా: బ్రహ్మోత్సవాల్లో భాగంగా వరంగల్ రామన్నపేట బట్టల బజారులోని బాలానగర వేంకటేశ్వర స్వామిని ఆదివారం ఊరేగించారు. ఉదయం 6గంటలకు సుప్రభాత సేవ, యాగశాల ప్రవేశం, మూలమంత్ర హోమం, ధ్వజారోహణం, పూర్ణాహుతి, తీర్థ ప్రసాదం, తదియారాధన (అన్న ప్రసాద) వితరణ జరిగింది. ఆలయ చైర్మన్ పరాశరం శ్రీనివాసా చార్యులు, ఈఓ ఎలపాటి రత్నాకర్ రెడ్డి, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకే కేంద్ర బడ్జెట్

న్యూశాయంపేట: బడా కార్పొరేట్ శక్తులకే కేంద్రం బడ్జెట్ భరోసా ఇచ్చిందని ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి అన్నారు. జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను వంచన చేసి, బడా కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసేలా ఉందని విమర్శించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి జక్కు రాజు, నాయకులు సదానందం, రామ్మూర్తి, లక్ష్మణ్, రాజేందర్, రాములు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిమిత్ర టీచర్స్ కాలనీ కమిటీ ఎన్నిక



విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రగతిమిత్ర టీచర్స్‌కాలనీ -1 అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.రాం రెడ్డి, సహాధ్యక్షుడిగా డాక్టర్ పుల్లయ్య, జనరల్ సెక్రటరీగా సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా జితేందర్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలుగా విజయ రమణారావు, దేవేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సీహెచ్.సందీప్, కల్చరల్ సెక్రటరీగా దేవేందర్ ఎన్నికయ్యారు. అలాగే, మహిళా కార్యదర్శులుగా స్వరూపరాణి, కన్నమాదేవితో పాటు మరో పదిమంది అడ్వైజర్లను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా డాక్టర్ కిషన్‌రావు వ్యవహరించారు. ఈ కమిటీ మూడేళ్లపాటు పనిచేస్తుంది.

బీజేపీ మండల అధ్యక్షుడిగా బోరిగం నాగరాజు



ఖిలా వరంగల్: తెలంగాణ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ కరీమాబాద్ మండల అధ్యక్షుడిగా బోరిగం నాగరాజు నియమితులయ్యారు. ఈమేరకు నాగరాజుకు జనతాపార్టీ ఎన్నికల అధికారి ఎడల లక్ష్మీ నారాయణ ఆదివారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం



మామునూరు: మామునూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని జక్కలొద్ది గుడిసెవాసుల కాలనీకి చెందిన మతిస్థిమితం లేని ఓ మహిళ శనివారం అదృశ్యమైనట్లు ఎస్సై కృష్ణవేణి తెలిపారు. ఖిలా వరంగల్‌కు చెందిన పోలు సమత (27) కుటుంబ సభ్యులతో కలిసి జక్కలొద్ది గుడిసెవాసుల కాలనీలో నివాసం ఉంటోంది. కొద్దిరోజులుగా సమత మతిస్థిమితం కోల్పోయింది. శనివారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. సమత భర్త పోలు రాజుకుమార్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణవేణి ఆదివారం తెలిపారు.

పరామర్శ

హసన్‌పర్తి: ఇటీవల అనారోగ్య సమస్యలతో మరణించిన గంటూరుపల్లికి చెందిన కాంట్రాక్టర్ లింగారెడ్డి, రేవూరి సుగుణమ్మ, హసన్‌పర్తికి చెందిన మారం సుశీలమ్మ కుటుంబ సభ్యులను కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వరంగల్ అర్బన్:

9951602875 9553955722

9010299096

Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

ఎల్. రాజేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)

కె. సుధాకర్ రెడ్డి (ACO) : 9177258410 (హన్మకొండ)

కె. రవీందర్ (SR) : 9705236356 (వరంగల్)

పి.చంద్రశేఖర్ (ACO) : 9963646944 (వరంగల్)